క్లుప్తంగా

రక్త నమూనాల సేకరణ

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లి గ్రామంలో షుగర్ వ్యాధి అనుమానితుల నుంచి వైద్యసిబ్బంది శుక్రవారం రక్త నమునాలను సేకరించారు. పరీక్షలు నిర్వహించి ఫలితాల అధారంగా చికిత్సలు అందించనున్నట్లు వైద్యసిబ్బంది పేర్కొన్నారు.

పరిశుభ్రంగా ఉంచుకోవాలి..

వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలకు దూరంగా ఉండొచ్చన్నారు. ఫ్రైడే డ్రైడేలో భాగంగా గ్రామంలోని పలు కాలనీల్లో పర్యటించి పారిశుద్ధ్య నివారణ చర్యలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రాంచందర్, సతీష్, శ్రీలక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన తహసీల్దార్



పాన్‌గల్: గతంలో తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన సత్యనారాయణరెడ్డి తిరిగి శుక్రవారం వీధుల్లో చేరారు. 34 రోజుల పాటు సెలవుల్లో ఉండటంతో ఇక్కడ ఇంచార్జి తహసీల్దార్‌గా ఉన్న అబ్రహాంలింకన్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. రెగ్యులర్ తహసీల్దార్ నియమించడంతో సమస్యల పరిష్కారంలో జాప్యం ఉండదని ప్రజలు ఆశిస్తున్నారు.

ఉద్యోగ విరమణ తప్పదు

వనపర్తిటౌన్: ఉద్యోగ విరమణ ఉద్యోగులకు తప్పదని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. యాపర్ల జీహెచ్‌ఎం శంకర్‌గౌడ్ ఉద్యోగ విరమణ సభ శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన మాజీమంత్రి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యుడు రావుల చంద్రశేఖర్ రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్, వైస్ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, వామన్‌కుమార్‌గౌడ్, మున్సిపల్ మాజీచైర్మన్‌లు రమేష్‌గౌడ్, గట్టుయాదవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ, డీజేఎస్ ఖాదర్ పాషా, ప్రజాకవి జనజ్వాల, రాజారామ్‌ప్రకాశ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు ప్రొసీడింగ్‌ల అందజేత

వీపనగండ్ల: మండలంలోని ఆయా పథకాల్లో ఎంపికైన లబ్ధిదారులకు నేడు కొల్లాపూర్‌లో రాష్ట్ర మంత్రులచే అందజేయనున్నరని మండల కాంగెస్ పార్టీ అధ్యక్షుడు బీరయ్యయాదవ్ అన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. నేడు డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లను అందజేయనున్నారు. సమావేశంలో నారాయణరెడ్డి, ఎత్తం కృష్ణయ్య, జిల్లా ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు వెంకటేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వెంకటస్వామి, రవీందర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, కావలి మహేష్, గోపి, రఘువర్ధన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

వీపనగండ్ల: మండలంలోని ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో పసిపిల్లలకు టీచర్‌లు బాలామృతం అందజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణమ్మ, పారిజాత, బలుసలక్ష్మి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు తేదీలతో నోటీసులు జారీ

మదనాపురం: మండలంలోని శంకరమ్మపేటలో తమ ఇంటికి తప్పుడు తేదీలతో ఉన్న నోటీసులు ఎలాంటి సమాచారం లేకుండా అతికించారని రాములు శుక్రవారం ఓ ప్రకటనలో ఖండించారు. రెవెన్యూ అధికారులు భూములకు సంబంధించిన నోటీసు ఇంటి దగ్గర లేని సమయంలో అతికించి వెళ్లడం సరైంది కాదని అందులో 2025 జనవరి నెల మాత్రమే రాసి ఉన్నదని పేర్కొన్నారు. అధికారులపై చర్యలు తీసుకోవాలనీ లేనియెడల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని చెప్పారు.

అంత్యక్రియలకు సాయం

వీపనగండ్ల: మండలకేంద్రానికి చెందిన బాలకిష్టమ్మ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకుడు మల్లయ్యయాదవ్ దహన సంస్కారాలకు ఆర్థికసాయాన్ని అందజేశారు. బాలకిష్టమ్మ మనవరాలు అలివేల అనాథగా మిగిలిపోయింది. ఈ సందర్భంగా బాలికను ఆదుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

రిజర్వాయర్ పూర్తి చేయాలి

రాజోళి: తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకంలో భాగంగా బ్యాలన్స్ రిజర్వాయర్ పనులు వెంటనే పూర్తి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు శశికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మోటార్ల ద్వారా నీటిని ఎత్తిపోసే వరకు పనులు చేసి ఓట్లు దండుకున్నారని, మల్లమ్మకుంట, ఇతర రిజర్వాయర్ల పనులు పెండింగ్‌లో ఉంచారన్నారు. అధికారంలోకి వస్తే వాటిని మేమే పూర్తి చేస్తామని చెప్పిన రేవంత్ సర్కార్ కూడా దానిపై స్పందించకుండా కాలయాపన చేస్తుందని ఆరోపించారు. ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా నీరు వృథాగా దిగువకు వెళ్తుందని, దాన్ని వదిలేసి నీటి దోపిడి అంటూ ఆరోపణలతో రైతులకు అన్యాయం చేస్తున్నారన్నారు. వీలైనంత త్వరగా తుమ్మిళ్ల లిఫ్టులో బ్యాలన్స్ రిజర్వాయర్ పనులు పూర్తి చేయాలని పేర్కొన్నారు.

నిఘా నిద్దరోతోంది..!

- పనిచేయ్యని సీసీ కెమెరాలు
- చోరీల నియంత్రణకు అడ్డుకట్ట ఏది..?
- మరమ్మతులకు నోచుకోని వైనం



అమరచింతలో గాంధీ విగ్రహం స్తంభానికి ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

అమరచింత: పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఎప్పుడు ఎక్కడ ఏం జరుగుతున్న సన్నివేశాలను రికార్డు చేసుకోనే నిఘా నేత్రాలు మరమ్మతుల కారణంగా నిద్దరోతున్నాయి. పట్టణంలో అక్రమ ఇసుక రవాణాతో పాటు దోపిడి దొంగల ఆటకట్టించేందుకు పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచెయ్యలేక పోతున్నాయి. దీంతో అక్రమంగా ఇసుకను తరలించి వ్యాపారం చేసుకోనే వాళ్లకు మంచి అవకాశం దక్కింది. ఎప్పుడుపడితే అప్పుడు తమ దందాలను నడుపుకొంటున్న పరిస్థితులు దాపురించింది. పట్టణంలోని ప్రధాన రహదారులతో పాటు ఆయా వీధుల్లో మొత్తంగా 22 సీసీ కెమెరాలను గత 4ఏళ్ల కిందట ఏర్పాటు చేశారు. వీటితోపాటు మైక్‌సిస్టం పెట్టడంతో ఎక్కడ ఏం జరుగుతుందో అన్న విషయాలను పోలీసు కంట్రోల్ రూం నుంచే పర్యవేక్షిస్తూ వారికి అక్కడి నుంచే హెచ్చరికలు జారీ చేసేవాళ్లు. అలా ఆరునెలల కాలం గడవక ముందే సీసీ కెమెరాల వైర్లు ఈదురు గాలులు, భారీలోడ్‌లతో వెళ్తున్న వాహనాల తాకడంతో తెగిపడ్డాయి. దీంతో షాట్‌సర్క్యూట్ కారణంగా 22 సీసీ కెమెరాలు పని చెయ్యలేక పోతున్నాయి. గత రెండున్నర ఏళ్లుగా నిఘా నేత్రాలు మరమ్మతులకు నోచుకోలేక పోతున్న సంబంధిత పోలీసు అధికారులు పట్టించుకోలేక పోతున్నారు. ప్రజల భాగస్వామ్యం ఉండాలని వారు ఇచ్చే వివరాలతో సీసీ కెమెరాలను మరమ్మతులు చెయ్యిస్తామని పోలీసులు చెప్పుకొస్తున్నారు.

వర్తక సంఘం.. దాతల సహకారంతో

పట్టణంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చెయ్యడానికి పోలీసులు దాతల సహకారం కోరడంతో వ్యాపారులు, ప్రజలు తమకు తోచిన విధంగా ఆర్థిక సహకారం అందించారు. దీంతో పట్టణంలోని పలు ప్రాంతాలు, ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలతో పాటు మైక్ పొంగలను ఏర్పాటు చేశారు. మొత్తంగా మొదటి దశలోనే 22 నేత్రాలను ఏర్పాటు చేశారు.



రాజీవ్ చౌరస్తాలో..

కంట్రోల్‌రూం నుంచే పర్యవేక్షణ..

సీసీ కెమెరాలను పోలీస్‌కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షిస్తూ నిబంధనలను అతిక్రమించిన వారికి ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మైక్ ద్వారా సూచనలను అందించే వారు. బస్టాండ్ రహదారిలో ఆటోలు, టాటా ఏసీ వాహనాల డ్రైవర్‌ల ఆగడాలను సైతం నియంత్రించే వాళ్లు. కానీ ప్రస్తుతం నేఘా నేత్రాలు పనిచేయ్యడం లేదని తెలిసిపోవడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రతరమైన పట్టించుకునే అధికారులే కరువయ్యారు.

సీసీ కెమెరాల మరమ్మతుకు చర్యలు..

పట్టణంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు తమ వంతు చర్యలు తీసుకుంటున్నాం. వీటి వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు అవగాహన కల్పించాం. వారు ఇచ్చిన విరాళాలతో వాటిని ఏర్పాటు చెయ్యాలనుకున్నాం. అప్పటి ఎస్‌ఐ విరాళాలను సేకరించారు. వాటి వివరాలను తెలుసుకుని ఏర్పాటుపై చర్యలు తీసుకుంటాం. – శివకుమార్, సీఐ

మరోమారు విరాళాల సేకరణ..

పట్టణంలో సీసీ కెమెరాలు మరమ్మతులకు గురైందని వాటిస్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలని పట్టణ వర్తకులతో పాటు దాతల సహకారంతో విరాళాలు సేకరించే పనులు ఎస్‌ఐ సురేష్ ఆధ్వర్యంలో చేపట్టారు. కాగా ఎస్‌ఐ సురేష్‌ను ఇటీవల నారాయణపేటకు వీఆర్‌కు పంపడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చిందని పట్టణ ప్రజలు, విరాళాలు ఇచ్చిన దాతలు అంటున్నారు.

రెచ్చిపోతున్న వరాహాల దొంగలు

- పోలీసులను హడలెత్తిస్తున్న వైనం
- తప్పించుకునే యత్నంలో పోలీసు వాహనంపై దాడి
- ఆలస్యంగా వెలుగు చూసిన దాడి ఘటన



దెబ్బతిన్న అమరచింత పోలీస్ వాహనం

అమరచింత: జిల్లాలో రోజురోజు పందుల దొంగలు రెచ్చిపోతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎక్కడపడితే అక్కడ పందులను చోరీ చేసి వాటిని రాత్రికి రాత్రే రాష్ట్ర సరిహద్దులను దాటిస్తున్నారు. తాజాగా కొల్లాపూర్ నుంచి 70 పందులను చోరీ చేసి వాహనంలో తరలిస్తున్నారనే సమాచారంతో పోలీసులు అప్రమత్తం అయిన పందుల దొంగలు ఏకంగా తమను చేజింగ్ చేస్తున్న వాహనంపై దాడి చేసి తప్పించుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణ శివారులోని షెడ్ నుంచి 70 పందులను బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసి వాహనంలో అమరచింత మీదుగా తీసుకెళ్తున్నారు. ఈ విషయాన్ని కొల్లాపూర్ పోలీసుల నుంచి ఆత్మకూర్ సీఐకి సమాచారం అందగా, వాటిని నిలువరించేందుకు ఆత్మకూర్,అమరచింత పోలీసులను అలర్ట్ చేశారు. ఆత్మకూర్ చౌరస్తాలో డీసీఎంతో పాటు మరో వాహనాన్ని రహదారికి అడ్డుపెట్టి పోలీసులు కాపలకాసిన వారి నుంచి తప్పించుకుని అమరచింత మీదుగా వాహనాన్ని తీసుకెళ్లారు. అమరచింత నుంచి పోలీసులు తమ వాహనంలో వెంబడించగా నాగల్‌కడ్మూర్ శివారులో పందులతో వెళ్తున్న వాహనాన్ని సడన్‌గా ఆపారు. దీన్ని గమనించిన పోలీసులు తమ వాహనం నిలుపుకొనే లోపల వాహనాన్ని స్టాట్‌చేసి రివర్స్‌లో వచ్చి పోలీసు వాహనంను ఢీ కొని దెబ్బతింది. అంతే కాకుండా వాహనంలో ఉన్న వ్యక్తులు ఖాళీ సీసాలు, రాళ్ళతో పోలీసు వాహనంపై దాడి చేస్తూ అక్కడి నుంచి తప్పించుకుని వెళ్లారు. దీంతో దెబ్బతిన్న వాహనంను సీఐ కార్యాలయానికి తరలించారు. ఏదీ ఏమైన పందులను దోచుకుంటున్న దుండగులు చివరకు పోలీసులపైనే దాడికి దిగడం ఏమిటని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ విషయాన్ని సీఐ శివకుమార్‌ను అడగగా కొల్హాపూర్ పోలీసుల నుంచి సమాచారం రావడంతో వాహనంను అడ్డుకోనే యత్నం చేశామని, పట్టుకునే యత్నంతో రివర్స్‌లో వచ్చి తమ వాహనాన్ని గుద్దివెళ్లడం జరిగిందన్న విషయాన్ని ఉన్నతాధికారులకు విన్నవించామన్నారు.

ఎల్వోసీ చెక్కు అందజేత



ఎల్వోసీ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

గోపాల్‌పేట: మండల కేంద్రానికి చెందిన చిన్నయ్య ఇటీవల అనారోగ్యానికి గురై హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రి ఆసుపత్రిలో చేరాడు. జిల్లా ఆర్టీఐ చైర్మన్ కొంకిరమేష్ విషయాన్ని టౌన్‌ప్రెసిడెంట్ శివన్న, వెంకటయ్య, ఉమ్మడి మండల ఇంచార్జి సత్యశీలారెడ్డి ద్వారా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్ళాడు. వెంటనే స్పందించి ఎమ్మెల్యే మేఘారెడ్డి రూ. 2.5లక్షలు మంజూరు చేయించి శుక్రవారం కుటుంబసభ్యులకు ఎల్‌ఓసీ అందించారు.

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వీడండి



కొత్తకోటలో పాల్గొన్న కమిషనర్ సైదయ్య



జరిమానా రసీదును అందిస్తున్న అధికారి

కొత్తకోట రూరల్: కొత్తకోట మున్సిపాలిటీ పరిధిలో 'ఫ్రైడే-డ్రై డే'ను పట్టణంలోని నాల్గో వార్డులో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ సైదయ్య ముఖ్యఅతిథిగా హాజరై కాలనీవాసులతో మాట్లాడారు. వ్యాధులపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్లు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతోనే ఆరోగ్యం

అమరచింత: పరిసరాలను పరిశుభ్రంగా ఉండుకోవడంతోనే ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని మున్సిపల్ కమిషనర్ నాగరాజ్ అన్నారు. పట్టణంలో 2వవార్డులో శుక్రవారం పరిసరాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వీపనగండ్ల: పారిశుద్ధంపై ఎలాంటి నిర్లక్ష్యాన్ని ప్రదర్శించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ శ్రీనివాసారావు అన్నారు. శుక్రవారం గోవర్ధనగిరి ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి వంశీకృష్ణ, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ శుభ్రత పాటించాలి

ఖిల్లాఘనపురం: ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీఓ రాజు అన్నారు. శుక్రవారం ఫ్రైడై డ్రైడేను సోళీపురం గ్రామంలో ఆయన పర్యటించి నిల్వనీటిని పారబోయించారు. ఈ సందర్భంగా ప్రజలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణకు చర్యలు

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలో ప్లాస్టిక్ నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం హెల్త్ అసిస్టెంట్ శివకుమార్ పట్టణంలో పలు షాపులపై ప్లాస్టిక్ రైడ్ నిర్వహించి రూ.12,500 జరిమానా విధించినట్లు చెప్పారు. అదేవిధంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమా మహేశ్వర్ రెడ్డితో కలిసి కమిషనర్ ఆయా వార్డుల్లో ఫ్రైడే-డ్రైడే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎంసీ బాలరాజు, జూనియర్ అసిస్టెంట్ సాయికృష్ణ, వార్డు ఆఫీసర్ నితీష్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తను పారబోస్తే చర్యలు

ఆత్మకూర్: చెత్తను ఆరుబయట పారబోస్తే జరిమానాలు విధించి చర్యలు తీసుకుంటామని ప్రతిఒక్కరూ పరిశుభ్రతను పాటించాలని మున్సిపల్ కమిషనర్ శశిధర్ అన్నారు. శుక్రవారం స్థానిక పురపాలికలో వార్డుల్లో డ్రైడే ఫ్రైడేలో పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సురేందర్‌గౌడ్, అధికారులు ఝాన్సీరెడ్డి, అనూష, మోహన్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకంతో అనర్థాలు..

ప్లాస్టిక్ వల్ల అనర్థాలు జరుగుతాయని కమిషనర్ అన్నారు. శుక్రవారం స్థానిక దుకాణాల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కిరాణషాపులో 120 ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుని రూ.2వేలు జరిమాన విధించారు.

ఆలయ పునర్నిర్మాణానికి ఇంటింటి ప్రచారం

అమరచింత: పట్టణంలోని పురాతనమైన ఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణం కోసం ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం కరపత్రాలతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ నెల 7న ప్రత్యేక పూజ నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 14న ఆలయ నిర్మాణానికి భూమిపూజకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రమేష్, కొట్టం వెంకట్‌రెడ్డి, అచ్యుతారెడ్డి, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డులు మంజూరు

పాన్‌గల్: మండలానికి 1,149 నూతన రేషన్‌కార్డులు మంజూరైనట్లు ఇంచార్జి తహసీల్దార్ అబ్రహాంలింకన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంజూరైన రేషన్ కార్డులు గ్రామాల వారీగా వివరాలు ఇలా ఉన్నాయి. పాన్‌గల్ 101, కొత్తపేట 32, రేమద్దుల 35, మాందాపూర్ 38, దొండాయిపల్లి 15, చింతకుంట 34, మల్లాయిపల్లి 30, అన్నారం 27, దావాజిపల్లి 48, గోప్లాపూర్ 46, కిష్టాపూర్ 35 మంజూరయ్యాయి. అలాగే మాధరావుపల్లి 25, శాగాపూర్ 48, బండపల్లి 20, జమ్మాపూర్ 36, వెంగళాయిపల్లి 15, మంగళ్ళపల్లి 19, కేతేపల్లి 29, బుసిరెడ్డిపల్లి 126, రాయినిపల్లి 23 మంజూరయ్యాయని తహసీల్దార్ పేర్కొన్నారు.

విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలి



ఆత్మకూర్: సీజనల్ వ్యాధులపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని తిప్డంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఫయాజ్‌అహ్మద్ అన్నారు. శుక్రవారం పట్టణంలో ఎస్సీ బాలుర హాస్టల్‌లో వైద్యశిబిరంలో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సరిత, ఆరోగ్య పర్యవేక్షకుడు సురేందర్‌గౌడ్, వార్డెన్ పరశురాం, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కస్తూర్బాను పరిశుభ్రంగా ఉంచండి



కేజీబీవీని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

అమరచింత: మండలంలోని కస్తూర్బా పాఠశాలలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడమే కాకుండా విద్యార్థినులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని బీజేపీ మండల అధ్యక్షురాలు మంగ లావణ్య కోరారు. ఏబీవీపీ నాయకులతో కలిసి శుక్రవారం కేజీబీవీని సందర్శించారు. ఈసందర్భంగా పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఎస్‌ఓ, సీఆర్‌టీల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కేజీబీవీలకు నిధులను మంజూరు చేస్తున్నదన్నారు. గతేడాది పాఠశాలలో విద్యార్థినులు ఫుడ్‌పాయిజన్‌కు గురయ్యారని అలాంటి ఘటనలు మరోమారు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు రాజేష్ ,ఉదయ్, టైలర్ నరసింహా పాల్గొన్నారు.

ఇళ్ల మంజూరులో ప్రభుత్వం విఫలం



ఇళ్లు మంజూరు కాని వారితో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

అమరచింత: నిజమైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఐ నాయకులు ఆరోపించారు. పట్టణంలో శుక్రవారం 8, 10 వార్డుల్లో ఇళ్లు మంజూరు కాని వారిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 8వ వార్డులో నూర్జహాన్ బేగం, మల్లైకాబేగం, షాహిన్ ఇళ్లు కూలిపోయాయి. అలాగే 4వ వార్డులో సామెలు గుడిసెను తొలగించుకున్నాడని తెలిపారు. గురువారం ఇళ్ల ప్రొసిడింగ్‌లను పంపిణీ చేసిన మంత్రి వాకిటి శ్రీహరి లబ్ధిదారులకే మంజూరు చేశామని ప్రకటించడం ఎంతవరకు సమంజసమన్నారు. అర్హులకు మంజూరు చేయకపోతే పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రవీందర్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్, భాస్కర్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే శిక్షలు కఠినం



రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

ఆత్మకూర్: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠినమైన శిక్షలు తప్పవని ఎస్సై నరేందర్, ఏవో వినయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం టాస్క్‌ఫోర్స్ బృందం పట్టణంలో విత్తన, ఫర్టిలైజర్స్ షాపుల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా షాపుల్లో స్టాక్ రిజస్టర్లను పరిశీలించారు. వారి వెంట ఏఈవోలు మహేష్, ఝాన్సీ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

వనపర్తి టౌన్: ఈనెల 6వ తేదీన కోల్‌కత్తాలో జరిగే ఎస్టీఎఫ్‌ఐ 9వ, వార్షిక సమావేశాలు విజయవంతం చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవిప్రసాద్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా సంఘం కార్యాలయంలో ఎస్టీఎఫ్‌ఐ జెండా ఆవిష్కరించి మాట్లాడారు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగులపై వ్యతిరేక విధానాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వార్షిక సమావేశాల వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు కె.జ్యోతి, జిల్లాకార్యదర్శి ఎండీ హమీద్ తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనుల పరిశీలన



మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కోట్ల రవి

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని 27, 28, 29వ వార్డులకు అందించే తాగునీటి పైప్‌లైన్ మరమ్మతు పనులను శుక్రవారం కాంగ్రెస్ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు కోట్ల రవి పరిశీలించారు. పైప్‌లైన్ మరమ్మతులకు గురికావడంతో వార్డు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో మున్సిపల్ ఏఈ దృష్టికి తీసుకెళ్లి పనులను చేపట్టేందుకు కృషి చేసినట్లు తెలిపారు. సమస్యను గుర్తించి తాగునీటి సమస్య లేకుండా చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

కాల్వలు లేక.. రోడ్లపైనే మురుగు



మాందాపూర్ గ్రామంలో..



రాయినిపల్లి గ్రామంలో రహదారిపై మురుగు



బుసిరెడ్డిపల్లి గ్రామంలో రోడ్లపై ఇలా..

పాన్‌గల్: మండలంలోని రాయినిపల్లి, మాందాపూర్, బుసిరెడ్డిపల్లి గ్రామాల్లో సరైన మురుగు కాల్వలు లేక నీరు రోడ్లపైనే ప్రవహిస్తుండటంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించిన సైడ్ కాల్వలను నిర్మించక పోవడంతో మురుగు రహదారులపై ప్రవహిస్తున్నాయి. మురుగు నీటి నిల్వతో దుర్వాసన వెదజల్లడంతో పాటు వ్యాధులు ప్రబలుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. వర్షాకాలం కావడంతో కాలనీలు మరి అధ్వానంగా మారినట్లు ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. గ్రామాల్లో ప్రతివారం డ్రైడే నిర్వహిస్తున్నా, మరోపక్క ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని చెబుతున్నా.. గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగు పడకపోవడం ప్రజలది తప్పా, అధికారులది తప్పా... ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామాల్లో కాల్వలను నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.